— అంతే. దట్సాల్.

ఆనందరావు వేళ్ళు తువ్వాలుని కొంచెం పల్చగా నలిపి రూపాయి బిళ్ళ మీద తడిమాయి. ఉత్తర క్షణార్థంలో తువ్వాలు గుడ్డతోపాటు బిళ్ళని పైకి తీసుకోబోయాయి. కాని బిళ్ళ లేచినట్టు లేదు. మునివేళ్ళకు తువ్వాలు గుడ్డే తగులుతోంది. తీసిన తువ్వాలును మళ్ళీ వదిలేశాడు.

కుర్ర వెధవలు నిశ్శబ్దంగా వున్నారు.

చూస్తున్నారా? ... లేపోతే వెళ్ళిపోయారేమో ఆకళ్ళేసి... తలెత్తకుండానే కన్నులెత్తి తూము కేసి చూశాడు. వెధవలు గోడ మీది కోతుల్లా అక్కడే కూర్చున్నారు. కాని కోతుల్లా కిచకిచమనటం లేదు... రూపాయిని మళ్ళీ లాగాడు. అది కదల లేదు. నిశ్శబ్దం చేతి మణికట్టుల్లో బ్రిడ్జి మీద రైలింజనులా అదర గొడుతోంది. నిండా ములిగినవాడికి చలేమిటి? హర హర మహాదేవ! — తువ్వాలు తీసేసి ఆ వెండి బిళ్ళని పట్టీగ్గా తీసుకోబోయాడు.

ఆ!...

అది రూపాయి బిళ్ళ కాదు! కార్బొ సోడా మూత. చదును చేసి తిరగేసి రోడ్డు మీద పెట్టి చిన్న మేకు కొట్టారు — రూపాయిలా కనిపించింది.

తాడుని చూసి పాముని చూసి తాడుని చూసి పామును చూసి

నిశ్శబ్దం భళ్ళున బద్దలైంది. ఈలలు, చప్పట్లు హర్షధ్వానాలు! ఒళ్ళు చచ్చిపోయింది. ఆనందరావు లేచింది. నిలబడి అటు చూసింది. ఓరి కుర్ర నా కొడుకుల్లారా! ఒక దీమడిని పీమడిని చేసి నవ్వే పీమగుల్లారా!... ఈ ఆశ — ఈ బాధ ఈ కష్టం మీకు ఇపుడు తెలీదురా. పదేళ్ళలో పెళ్ళిళ్ళయి ఐదారేసి మంది గాడిద కొడుకుల్ని కని జీతాలందకా అప్పులు దొరక్కా ఆకలి నీరసాలతో ఒళ్ళు తూలి కళ్ళు తిరిగి చావబోయే వేళ మీకు అర్థమవు తుందిరా... అలా అవాలని శపిస్తున్నామురా... మీరీ గోదారొడ్డు షికార్లూ, సినిమాలూ తెవుక్కుని ఆకలితో ఇళ్ళకెళ్ళేసరికి అమ్మా అన్నం అంటూ ఏడిలోంచే పిలిచేక పెట్టే వేళకి మీ కంచాల్లో కుంభాలు నొంపడానికి మీ తలిదండ్రులు నాలా ఎక్కడెక్కడ గడ్డి కరుస్తున్నారో అప్పులు చేస్తున్నారో అడుక్కుంటున్నారో దొంగతనాలూ మోసాలూ చేస్తున్నారో గొంతుకలు కోస్తున్నారో కాళ్ళు పట్టీ దొడ్లాడ్సీ ఏవేం హింసలు పడుతున్నారో — మీ ఆకళ్ళ గురించి ఎంతెంత క్షోభలు పడుతున్నారో మీకేం తెలుసురా భావి పౌర కుంకల్లారా అని గుండె గావుకేకలు పెట్టింది.

కసిగా చూస్తూ అలాగే నిలబడిపోయాడు. కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి.

ముసిలాడు పిగ్గుతో వెత్తిన గుడ్డేసుకుని పారి పోకుండా — బరితెగించి నిలబడి కసిగా చూడ్డంతో తూము మీద కుర్రాళ్ళు బెదిరారు. నవ్వులు మానేసి తూము దిగి నిలబడి ఆనందరావు వంక చూశారు. వాళ్ళ జోకు బెడిసికొట్టింది. ఆనందరావు ఇపుడు వాళ్ళ ముఖాన ఉమ్మేస్తే వాళ్ళు కోంబడరు. లాగి లెంపకాయ కొడితే తిరిగి కొట్టరు. ముఖాలలో తప్పు చేసి దొరికిపోయిన వాళ్ళలా ఒక జడ్డి నవ్వు జలగలా సాగి నిలబడింది.

పిడుగు!

ఆనందరావు వెత్తిన పేద్ద పిడుగు పడింది. తలని చీల్చి కపాలం బద్దలుకొట్టి లోపలికి దిగి గుండెలో పెతేలున మళ్ళీ పేలింది.

ఎదరగా వున్న ఆరుగురు భావి పౌరులలో ఒకడు తనకి తెలిసిన కుర్రాడు! బాగా తెలిసినవాడు.

తన పెద్ద కొడుకు!

17 ఏళ్ళ యువరాజు!

సుందర్రామారావు!

మైగాడ్!

ఇంతకన్న అవమానమేమి? ఓ రామచంద్రా! ఇంతకన్న అవమానమేమి?

తండ్రిని ఓడించిన వీరులుండేవారు. ఇవాళ తండ్రిని చావుదెబ్బ కొట్టిన వీరులు.. అబ్బా! ఏమి దెబ్బ!

—(మిగతా వచ్చే సంచికలో)



శేషప్రశ్న

లైబ్రరీలో కూర్చుని పేపరు తిరగేస్తున్నాడు రాంబాబు. దవడలు లోనికి పోయి మాసిన గడ్డంతో చీలికలు పడ్డ గుడ్డలతో నీరసంగా కన్పిస్తున్నాడు. నిస్తేజ మైన అతని కళ్ళల్లో సరికొత్త ఉషస్సు కోసం, దివ్య తేజస్సు కోసం ఎదురుచూపు వుంది.

కడుపులో మెలిపెడ్తున్నట్టు బాధ. అది ఆకలి బాధ. అనుభవంద్వారా తప్ప మరే విధంగానూ అర్థం చేసుకోలేని భయంకర అనుభూతి.

రాంబాబుకి డిగ్రీ వుంది, మంచి కాండక్ట్ వుంది, పనిచేయగల సమర్థత వుంది. కాని. పని యిచ్చే వాడే లేడు. అడిగే హక్కు రాజ్యాంగం యివ్వలేదు. తృప్తిగా బ్రతకటం, కష్టపడిన దానికి ఫలితం పొం దటం, అందరిలా భార్యా పిల్లలతో జీవన యాత్ర సాగించడం— యివి రాంబాబు కోర్కెలు. అవి తీరేది ఎలా అన్నదే అతడ్ని చాలా కాలంగా వెంటాడి వేధి స్తూన్న సమస్య

కడుపులో బ్రేవులు చుట్టుకు పోతున్నట్టుగా వుంది. ముఖం నిండా స్వేద బిందువులు పుట్టు కొచ్చి ఒక దానితో ఒకటి కలసి చిన్న ప్రవాహంలా మారాయి. అతి కష్టం మీద లేచి నిలబడ్డాడు. కళ్ళు తిరుగుతున్నట్ట న్పించి వెంటనే కూర్చీలో కూలబడి పోయాడు.

"బాబూ!"

నెమ్మదిగా కళ్ళు తెరిచి చూసాడు రాంబాబు. ఎదురుగా సీతాపతి మాస్టారు.

"ఏంబాబూ! భోజనం చెయ్యలేదా!"

ఆయన ఆప్యాయతకు కరిగిపోయాడు రాం బాబు. తినడానికి లేదని చెప్పాలో, తినలేదని చెప్పాలో తెలియక అతని మధ్యతరగతి మనసు తికమక పడింది. నీరసంగా పెదాలు కదిపాడు.

"తిన్నాను మాస్టారు. బోఫోర్స్ సమస్య అనే పప్పూ, అల్లుళ్ళ రాజకీయాలనే కూరలూ, సరిహద్దు తగాదాలనే పులుసూ, కోట్ల రూపాయిల ఖర్చుతో పార్టీ ప్రచార సభలనే గడ్డ పెరుగూ వేసుకొని తీవ్రవాదపు ఘాతుకాలను చవిచూస్తూ సుష్టుగా భోజనం చేశాను"

అతని మాటలకు మాస్టారి కళ్ళు వర్షించాయి.

"ఎప్పుడు ఈ సమాజం బాగుపడేది, ఎప్పుడు రాజకీయ వాదులు అసలు సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్ళించే వింత ధోరణికి స్వస్తి పలికేది, ఎప్పుడు సగటు మనిషి జీవితంలో కొత్తవెలుగు విరజిమ్మేది?"

తనలో తను గొణుక్కొంటున్నట్టుగా వుండి పోయారు మాస్టారు.

—పీసపాటి చంద్రశేఖర్